
నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ సత్యం తెలిపారు. బందారం, దుద్దెడ సబ్ స్టేషన్ ల పరిధిలోని బందారం, అంకిరెడ్డిపల్లి, కొండపాక, జప్తి నాచారం, దమ్మకపల్లి, దర్గా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY సిద్దిపేట 5

మంగళవారం 16 సెప్టెంబరు 2025

సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ అభ్యర్థులుగా

కూన సంతోష్, షఫీలను ప్రకటించిన జగ్గారెడ్డి





సంగారెడ్డిలోని దర్గా వద్ద జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ అభ్యర్థుల పేర్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఎన్నికలకు ముందుగానే ప్రకటించి రాజకీయ చర్చకు తెరలేపారు. సంగారెడ్డిలో ఆదివారం రాత్రి జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపల్ చైర్మన్‌గా యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, వైస్ చైర్మన్‌గా తాజా మాజీ కౌన్సిలర్ షేక్ షఫీ పేర్లను ప్రకటించారు. దీంతో అక్కడున్న వందలాది మంది జనం హర్షం వ్యక్తంచేశారు. చైర్మన్, వైస్ చైర్మన్లుగా తమ పేర్లను ప్రకటించడంతో కూన సంతోష్, షేక్ షఫీలు సంతోషం రెట్టింపైంది. సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయిస్తామని జగ్గారెడ్డి తెలిపారు.

ప్రజావాణికి 152 దరఖాస్తులు

- కలెక్టర్ హైమావతి

సిద్దిపేట/గజ్వేల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి మొత్తం 152 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌లతో కలిసి వినతులను స్వీకరించారు. అర్జీదారులు అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

వరద నీటి సమస్యను పరిష్కరించండి

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో, ప్రధాన రోడ్డుపై నెలకొన్న వరద నీటి సమస్యను పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు కలెక్టర్ హైమావతిని కోరారు. ఈ మేరకు వారు కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకులు కమ్మరి శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ మాట్లాడుతూ... ప్రజ్ఞాపూర్ ఊర చెరువు మత్తడి దూకిన ప్రతిసారీ వరదనీరు రోడ్డుపైకి చేరుతోందని, అక్రమ వెంచర్ల వలనే ఈ సమస్య తలెత్తుతోందని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్‌ను

పునరుద్ధరించాలి

- కేంద్ర మంత్రి సంజయ్‌కి మంత్రి పొన్నం లేఖ

హుస్నాబాద్, సెప్టెంబరు 15 : హుస్నాబాద్‌లోని సబ్ పోస్టాఫీసులో మూసివేసిన రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్‌ను తిరిగి పునరుద్ధరించాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరారు. ఈ విషయంపై సోమవారం పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌలభ్యం కోసం ఇండియన్ రైల్వేలు, పోస్టల్ శాఖతో కలిసి ఏర్పాటు చేసిన ఇండియన్ పోస్టల్ రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ (ఐపీఆర్ఆర్ఎస్) అనే సదుపాయాన్ని హుస్నాబాద్ సబ్ పోస్టాఫీసులో ఏర్పాటు చేశారని, అయితే కొన్ని సంవత్సరాల తర్వాత దానిని మూసివేశారని మంత్రి లేఖలో పేర్కొన్నారు. కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ, పోస్టల్ శాఖ అధికారులతో మాట్లాడి టికెట్ బుకింగ్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని కోరారు.

డయల్ 100కు కాల్

బాధితుడికి చేరిన ల్యాప్‌టాప్

గజ్వేల్, సెప్టెంబరు 15 : డయల్-100కు వచ్చిన కాల్‌తో పోలీసులు స్పందించి, బాధితుడు పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను అతనికి అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన రాకేష్ ప్రజ్ఞాపూర్‌లోని కాంటినెంటల్ హోటల్‌లో టీతాగి తన ల్యాప్‌టాప్‌ను అక్కడే మర్చిపోయాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత ల్యాప్‌టాప్ లేదని గుర్తించి వెంటనే డయల్ 100కు కాల్ చేశాడు. తక్షణమే స్పందించిన గజ్వేల్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది నవీన్, రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ జగన్మోహన్‌రెడ్డి హోటల్‌కు చేరుకుని ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ ల్యాప్‌టాప్‌ను రాకేష్‌కు అందజేశారు. విధులు సక్రమంగా నిర్వహించిన కానిస్టేబుళ్ల ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి కరాటే

పోటీలకు గజ్వేల్ విద్యార్థులు



గజ్వేల్‌రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు గజ్వేల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం మెదక్‌లో నిర్వహించిన కరాటే అండర్-14 విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో గజ్వేల్‌కు చెందిన బుడోకాన్ ఇంటర్నేషనల్ సంస్థలో శిక్షణ పొందుతున్న ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కరాటే మాస్టర్లు నరేష్, నరేందర్‌లు తెలిపారు.

యూరియా కొరత

అవే బాధలు.. అవే బారులు

రైతుల కలత

- వ్యవసాయ పనులు వదులుకుని క్యూలలో...
- ఉమ్మడి జిల్లాకు కేటాయింపు తగ్గడమే కారణం
- దసరా వరకు ఇదే పరిస్థితి
- చల్లిన యూరియాపైనా భారీ వర్షాల ప్రభావం
- మళ్లీ మళ్లీ టోకెన్లకు తరలివస్తున్న రైతాంగం
- నియంత్రించలేకపోతున్న పోలీసు యంత్రాంగం



వర్గల్ రైతువేదిక వద్ద బారులు తీరిన రైతులు

'రైతుల ఆందోళనలు, పోలీసుల కట్టడి వైఫల్యం, యూరియా కోసం బారులు'... ఇది ఉమ్మడి మెదక్ జిల్లాలో యూరియా కొరత వల్ల నెలకొన్న పరిస్థితి. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది తీవ్రమైన యూరియా కొరత రైతులను వేధిస్తోంది. వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు యూరియా కోసం క్యూ కడుతున్నారు. ఒక బస్తా కోసం రైతులు గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. దసరా పండుగ సమీపిస్తున్నా రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ప్రభుత్వం యూరియా కేటాయింపులు తగ్గించడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగవుతాయి. వరి, మొక్కజొన్నకు రెండు విడతలు, పత్తికి ఒక విడత యూరియా చల్లాల్సి ఉంటుంది. అయితే, జూలైలో తొలి దఫా, ఆగస్టులో రెండో దఫా యూరియా అవసరం ఉన్నా, నిల్వలు లేకపోవడంతో రైతులు యూరియా వేయలేకపోయారు. ఇక రోజుల తరబడి బస్తాల కోసం పొద్దంతా పడిగాపులు కాస్తున్నారు.

- సిద్దిపేట, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

7

ఆగస్టులో యూరియా వివరాలు (టన్నుల్లో)

జిల్లా	అవసరం	వచ్చింది	రావాల్సింది
సిద్దిపేట	13,090	6,545	6,545
సంగారెడ్డి	6,616	4,675	1,541
మెదక్	10,810	8597	1,644
మొత్తం	30,516	19,817	9,730

సెప్టెంబరులో యూరియా వివరాలు (టన్నుల్లో)

జిల్లా	అవసరం	వచ్చింది	రావాల్సింది
సిద్దిపేట	8,060	6,643	1,417
సంగారెడ్డి	4,726	2,690	2,034
మెదక్	4,060	2,754	1,320
మొత్తం	16,846	12,087	4,771



గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నర్సారెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌లో వర్గపోరు

- డీసీసీ, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మధ్య విబేధాలు
- అధిష్ఠానానికి ఒకరిపై మరొకరు ఫిర్యాదు
- గాంధీభవన్‌కు చేరిన పంచాయితీ

సిద్దిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య అంతర్గత విబేదాలు తారాస్థాయికి చేరాయి. జిల్లాలో పలు నియోజకవర్గాల నాయకుల మధ్య వర్గపోరు పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేంతగా తయారైంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని అధిష్ఠానం పదేపదే సూచించినా, జిల్లా నాయకుల తీరులో మాత్రం మార్పురావడం లేదు. కొంతకాలంగా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మధ్య వర్గపోరు తీవ్రంగా నడుస్తోంది. సమాచార లోపం కారణంగా పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ఇరువురు నేతలు వేర్వేరుగా నిర్వహిస్తుండటంతో కిందిస్థాయి కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఉండాలని అధిష్ఠానం డీసీసీలకు సూచించింది. ఈ మేరకు సిద్దిపేటలో కొన్ని నెలల క్రితం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో నియోజకవర్గ ఇన్‌చార్జులైన పూజల హరికృష్ణ (సిద్దిపేట), చెరుకు శ్రీనివాస్‌రెడ్డి (దుబ్బాక)కి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి కార్యాలయం ప్రారంభించారని కిందిస్థాయి నాయకులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జులను సమన్వయం చేసుకోవడం లేదని ఆయా వర్గాల అనుచరులు ఆరోపిస్తున్నారు. దీనితో పార్టీ కార్యక్రమాల విషయంలో వేర్వేరుగా వ్యవహరించాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయా వర్గాల నాయకులు మండిపడుతున్నారు.

అధిష్ఠానానికి చేరిన ఫిర్యాదులు

డీసీసీ, నియోజకవర్గ ఇన్‌చార్జిల మధ్య పోరు కారణంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం జరుగుతుందని భావించిన పలువురు నాయకుల అనుచరులు ఒకరిపై మరొకరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ క్యాంపు కార్యాలయానికే పరిమితమయ్యారని డీసీసీ నర్సారెడ్డి వర్గం ఫిర్యాదు

మిగతా 8వ పేజీలో



పొంగిపొర్లుతున్న నారాయణరావుపేట పెద్ద చెరువు పల్లె మత్తడి



గుర్రాలగొందిలో కూలిన పాఠశాల ప్రహరీ

తడిసిముద్దయిన జిల్లా

- ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షం
- పొంగుతున్న వాగులు, చెక్‌డ్యాంలు
- కల్వర్టుల పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద
- గరిష్ఠంగా 24.5 సెం.మీ. వర్షపాతం నమోదు



లక్ష్మీదేవిపల్లి-నారాయణరావుపేట రోడ్డులోని కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

సిద్దిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో సిద్దిపేట జిల్లా తడిసిముద్దయింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం వల్ల వాగులు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. సోమవారం రాత్రి కూడా పలు చోట్ల వర్షం కురిసింది. లక్ష్మీదేవిపల్లి-నారాయణరావుపేట రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లోని కల్వర్టు పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జిల్లాలో ఆదివారం నుంచి కురిసిన వర్షానికి గరిష్ఠంగా నారాయణరావుపేటలో 24.5 సెం.మీ వర్షపాతం నమోదైంది.

గురుకుల పాఠశాలలో కూలిన ప్రహరీ

జిల్లాలో కురిసిన భారీ వర్షానికి నారాయణరావుపేట మండలం ఓని గుర్రాలగొందిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రహరీ కూలింది. రాత్రి సమయం కావడంతో విద్యార్థులు వారి గదుల్లోనే ఉండడంతో ప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షం వల్ల నారాయణరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు నిండుకుండలాగా మారాయి. మాటిండ్ల కొత్తచెరువు వద్ద నక్కవాగు, నారాయణరావుపేట పెద్ద చెరువు పల్లె మత్తడి, పలు ప్రాంతాల్లో కుంటలు, చెక్‌డ్యాంలు, నక్క వాగు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లక్ష్మీదేవిపల్లి-నారాయణరావుపేట రోడ్డులో ప్రవహిస్తున్న వరద ధాటికి కల్వర్టుకు ఓ వైపు కోతకు గురైంది. చిన్నకోడూర్ మండలం రామునిపట్ల-గోనెపల్లి గ్రామాల మధ్యనున్న లోలెవల్ బ్రిడ్జిపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

'సింగూరు'కు మళ్లీ వరద..

తెరుచుకున్న మూడు గేట్లు

- ఇన్‌ఫ్లో 24,284..

ఔట్‌ఫ్లో 24,777 క్యూసెక్కులు

7

కర్ర శ్రీహరికి ప్రముఖుల

ఘన నివాళి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన కేంద్రమంత్రి బండిసంజయ్

8

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు

కమ్యూనిస్టులే వారసులు

- మహ్మదాపూర్ గుట్టల్లో అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి : చాడ వెంకటరెడ్డి

7



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మెప్మా బాధితులు

నోటీసులొస్తున్నాయ్..!

- అధికారులు మమ్మల్ని పట్టించుకోవాలి
- లేదంటే.. ఆత్మహత్యలే శరణ్యం
- మెప్మా బాధితుల ఆవేదన

గజ్వేల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : "బ్యాంకు, కోర్టు నుంచి నోటీసులు వస్తున్నాయి... మమ్మల్ని అధికారులు పట్టించుకోవాలి." లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని మెప్మా బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం మెప్మాలో మోసపోయిన అయా గ్రూపుల బాధిత మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పేరు మీద రుణాలు తీసుకుని కట్టలేదని, దీంతో తమకు బ్యాంకుల నుంచి, కోర్టుల నుంచి నోటీసులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సంబంధం లేకుండా తమ పేర్లపై లోన్లు తీసుకున్నారని, చివరకు శ్రీనిధి డబ్బును సైతం తీసుకున్నారని ఇదేమని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే తమను మోసం చేసిన సీవో, ఆర్పీ, ఇతరులపై చర్యలు తీసుకుని తమ పేరిట తీసుకున్న డబ్బును రికవరీ చేయాలని, బ్యాంకులో జమ చేయాలని కోరారు. ఇప్పటికే సీవో, ఆర్పీ, టీఎల్ఎఫ్ అధ్యక్షులపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది.

రూ.10 కోట్లతో అర్బన్‌పార్క్

- జిల్లెలగడ్డ సమీపంలోని అటవీ భూమిలో ఏర్పాటు
- సర్వాయి పాపన్న కోట వరకు పర్యాటక ప్రాంతంగా..

హుస్నాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లోని జిల్లెలగడ్డ సమీపంలో రూ.10కోట్ల వ్యయంతో అర్బన్ పార్క్ ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. 132 సర్వేనంబర్‌లోని దాదాపు 500 ఎకరాల్లో అర్బన్ పార్క్‌తో పాటు మొత్తం గుట్టలు, అడవులతో ఉన్న ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనలతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. జిల్లెలగడ్డకు దగ్గరగా ఉన్న 100 ఎకరాల్లో అర్బన్ పార్క్, మిగతా అటవీ, గుట్టల ప్రాంతంలో ట్రెక్కింగ్ పాత్స్, తీగల వంతెనలు, పర్యాటకులు సేద తీరే విధంగా మధ్య మధ్యలో గుడిసెలు నిర్మించనున్నారు. అర్బన్ పార్క్ నుంచి బయ్యన్న గుట్టలు, అటవీ ప్రాంతంలో ఉండే కాల భైరవుడు, అక్కడి నుంచి గుట్టుపైన నిర్మాణం చేసిన సర్దార్ సర్వాయి పాపన్నకోట వరకు వెళ్లేలా అభివృద్ధి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దానున్నారు. ఇప్పటికే దీని సమీపంలో ఉన్న మహాసముద్రం గండి ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా మార్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



పర్యాటకంగా తీర్చిదిద్దే గుట్టల ప్రాంతం

ప్రేమ వ్యవహారంతో మనస్తాపం..
సెల్ఫీ వీడియో తీసుకుంటూ యువకుడి ఆత్మహత్య


కమ్మరి నరేష్

తూప్రాన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంతో యువకుడు మనస్తాపానికి గురయ్యాడు. ప్రేమికురాలితో మాట్లాడి, చావును సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం, కథనం ప్రకారం.. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి శ్రీనివాసచారి కుటుంబం కొన్నేళ్ల క్రితం తూప్రాన్‌కు వచ్చి ఉంటోంది. ఆదివారం శ్రీనివాసాచారి, భార్య గిరిజ, కూతురు భవానీలతో కలిసి గ్రామంలో అన్న నెల మాసికం కోసం వెళ్లాడు. చిన్న కొడుకు కిషోర్‌చారి సోమవారం ఉదయం పనికి వెళ్లాడు. ఇంటి వద్దనే ఉన్న పెద్ద కొడుకు కమ్మరి నరేష్ అలియాస్ నితిన్ (22) ప్రేమించిన యువతితో ఫోన్‌లో మాట్లాడినట్లు చెబుతున్నాడు. ప్రేమ వ్యవహారంలో మనస్తాపానికి గురైన నరేష్ తన మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో రికార్డు చేస్తూ ఇంట్లో ఉరేసుకున్నాడు. పనికి వెళ్లిన కిషోర్ ఇంటికి వచ్చి తలుపులు తీసేందుకు ప్రయత్నించగా తెరవలేదు. దీంతో కిటికీ నుంచి చూడగా ఉరేసుకున్నట్లు గుర్తించాడు. ప్రేమ వ్యవహారంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి శ్రీనివాసాచారి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం వివరించారు.

అరకొర చదువులు
షిఫ్ట్ పద్ధతిలో బోధన

ఆంధ్రజ్యోతి ఫోకస్

● చెట్లకింద, వరండాలో, మైదానాల్లో..
● భవన నిర్మాణాలపై దృష్టిపెట్టని పాలకులు, అధికారులు


వరండాలో కూర్చున్న విద్యార్థులు


మల్‌చెల్మలో శిథిలమైన ప్రభుత్వపాఠశాల భవనం

జహీరాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలమైన నేపథ్యంలో అటువిద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. ఏగ్రామానికైన వెళ్ళి చూసిన ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలే దర్శనమిస్తున్నాయి. పాలకులు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పించడంతోపాటు నాణ్యవంతమైన విద్యను అందిస్తున్నామని ప్రగల్భాలు చెబుతు న్నప్పటికి క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగఉంది. జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనఖీలుచేస్తే వాస్తవాలు బహిర్గతం కానున్నాయి. నియోకవర్గంలో చెట్లు, వరండాలే విద్యార్థులకు తరగతి గదులుగా మారాయి. ఇంకొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేనికారణంగ విద్యార్థిని, విద్యార్థులు ఇళ్ళకు వెళ్ళాల్సి వస్తుంది.

మూడు గ్రామాల్లో షిఫ్టు పద్ధతుల్లో విద్యాబోధన

మండలంలోని మల్‌చెల్మ, చిరాగ్‌పల్లి, ధనసిరి గ్రామాల్లోగల ప్రభుత్వఉన్నత పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి.ఏ క్షణమైన కూలనుందనే ఆందోళనతో విద్యాశాఖఅధికారులు ఆయా గ్రామాల్లోగల ప్రాథమిక పాఠశాలల్లో షిఫ్ట్ ప్రాతిపదికన విద్యార్థులకు విద్యనందించాలని నిర్ణయించారు. గదులుసరిపోవని భావించి షిఫ్టులపద్ధతిలో తరగతుల నిర్వహణ కొనసాగుతుంది. ఉదయంపూట ప్రాథమిక, మధ్యాహ్నం ఉన్నతపాఠశాలల తరగతులను నిర్వహిస్తున్నారు.విద్యాబోధన సక్రమంగానే జరుగుతుందని అధికారులు చెబుతున్నప్పటికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగ ఉన్నాయి.సమయం సరిపోవడంలేదని, పాఠాలు అర్థకావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. మూడేళ్లుగా షిఫ్ట్ పద్ధతుల్లో తరగతుల నిర్వాహణ కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. దనసిరిలో అదనపు తరగతిగదుల నిర్మాణప్రక్రియ అర్థాంతరంగ నిలిచిపోయింది. నిధుల కొరత కారణంగ సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో స్లాబువేసి వదిలేశాడు. మల్‌చెల్మ గ్రామంలో భవనం శిథిలావస్థకు చేరింది. భవనాన్ని డిస్మెటల్‌చేసి నూతన భవనం నిర్మించాలని గ్రామస్థులు, అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించిన ప్రయోజనం కొరవడింది. చిరాగ్ పల్లిలో ప్రభుత్వం భవనం శిథిలావస్థకు చేరడంతో అక్కడే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలోనే షిఫ్ట్ పద్ధతిలో విద్యాబోధన జరుగుతుంది. రాష్ట్ర కాంగ్రెస్‌నాయకులు డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి గ్రామానికి సేవచేయాలనే సంకల్పంతో తనసొంత నిధులతో పాఠశాలభవనం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. త్వరలో భవనం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారు. త్వరలోనే నిర్మాణం పూర్తికానుందని అధికారులు, నాయకులు వివరించారు.

పాఠశాల భవనం తొందరగా నిర్మించాలి

మా గ్రామంలోగల ఉన్నతపాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన జరుగుతుంది. విద్యాబోధనలో సమయం సరిపోక పోవడంతో పాఠాలు అర్థంకాక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మల్‌చెల్మలో సొంత భవనం నిర్మించాని కోరుతున్నాం.

-సంజన, (విద్యార్థిని-మల్‌చెల్మ)

నష్టం కలగకుండా చూస్తున్నాం

పాఠశాల భవనాలు శిథిలం కావడంతో మల్‌చెల్మ, చిరాగ్‌పల్లి, ధనసిరి తదితర గ్రామాల్లో షిఫ్ట్ ప్రాతిపదికన విద్యాబోధన జరుగుతుంది. విద్యార్థులకు నష్టం కలగకుండా చూస్తున్నాం. శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్తభవనాల నిర్మాణాలకు అవసరమగు ప్రతిపాదనలను ఉన్నతాదికారులకు పంపించాం. నిధులు మంజూరై భవన నిర్మాణాలు పూర్తైతేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగనుంది.

- మాణయ్య,ఎంఈవో

ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ


వినతులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/మెదక్ మున్సిపాలిటీ/సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ప్రజావాణికి మొత్తం 96 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకే సమస్యలపైన పలుమార్లు వినతిని సమర్పించకుండా చూడాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి కాగానే.. తీసుకున్న నిర్ణయాలన్నీ సదరు దరఖాస్తుదారుడికి సమాచారాన్ని అందించాలన్నారు.

మరమ్మతుల పనులు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను త్వరితగతిన పునరుద్ధరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం మున్సిపల్ డంపింగ్‌యార్డును అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాలో ఈనెల 22 నుంచి 28 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

సంగారెడ్డిలో..

ప్రజావాణిపై ప్రజల్లో అధికారులు నమ్మకం కలిగించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు.

మెదక్ పోలీసు కార్యాలయంలో ..

పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

నిషేధిత మద్యం పట్టివేత

జహీరాబాద్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న 8గ్రాముల చరస్‌ను ఎక్సైజ్‌అధికారులు పట్టుకున్నారు. వారికథనం ప్రకారం.. సంగారెడ్డిజిల్లా చిరాగ్‌పల్లి అంతరాష్ట్ర ఎక్సైజ్‌చెక్‌పోస్టు వద్ద సోమవారం వాహనాల తనఖీ కార్యక్రమం చేపట్టారు. ఢిల్లీకి చెందిన అమర్‌జీత్‌రాథే తన జీపులో గోవా నుంచి చరస్ తీసుకుని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా వాహనం ఆపి తనఖీలు చేశారు. జీపులో చరస్, మద్యం లభ్యమైంది. వీటి విలువ సుమారు 60వేల వరకు ఉంటుందన్నారు. చరస్, జీపును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే పలువురు వివిధ వాహనాల్లో 17.245 లీటర్ల గోవామద్యం తెస్తున్న క్రమంలో పటుకున్నారు. ఈ తనఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లాటాస్క్‌ఫోర్స్ సీఐ గాంధీనాయక్, ఎస్సైలు హన్మంతు, యాదయ్య, రమేష్, మురళీ, ఇబ్రహీం, రాజా, సిబ్బంది, తదితరులున్నారు.

బాలికపై అత్యాచార ఘటనలో నిందితుడికి 20 ఏళ్ల జైలు

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం మాడ్పెట్‌పల్లి గ్రామానికి చెందిన తలారి మోహన్‌కి బాలికపై అత్యాచారం చేసిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష ఖరారైంది పెద్దశంకరంపేట ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 2020 సంవత్సరంలో మాడ్పేట్‌పల్లి గ్రామానికి చెందిన తలారి మోహన్ ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్లు ఇప్పిస్తానని ఆశచూయించి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానాకి పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపటారు. మెదక్ జిల్లా స్పెషల్ పోక్సో ఫాస్ట్ కోర్టులో పలు దఫాలుగా విచారణ చేశారు. తలారి మోహన్ నేరం చేసినట్లు రుజువైనట్లు గుర్తించిన జిల్లా సెషన్స్ న్యాయాధికారి నీలిమా అతడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పాపన్నపేట, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్ గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారంమండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మిన్‌పూర్ శేఖర్(30) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం పొలం వద్దకు వెళ్లాడు. పొలం పనులు చేస్తుండగా పొలం గట్టుపై ఉన్న కరెంట్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు అతడిని చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని చెప్పారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాజీ కౌన్సిలర్ హఠాన్మరణం


తాహేరాబేగం (ఫైల్)

జహీరాబాద్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, మాజీకౌన్సిలర్ గుండెపోటుతో ఆదివారం అర్ధరాత్రి హఠాత్తుగా కన్నుమూశారు. ఆమె మృతిపట్ల పలువురు పట్టణప్రజలు, నాయకులు, అభిమానులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె రెండవవార్డు కౌన్సిలర్‌గా మూడు సార్లు విజయం సాధించారని స్థానికులు తెలిపారు. ప్రజల మధ్యలో ఉంటూ ప్రజలకు తోచినస్థాయిలో సేవలందించిన తీరును గుర్తుకు చేసుకుని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె భౌతికకాయానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీమంత్రి డా.చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి, మాజీ టీఎస్ఐఐసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ తదితరులు ఆమె మృతిపట్ల విచారం వ్యక్తంచేశారు. ఆమె మృతదేహంపై పుష్పగుచ్చాలుంచి నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు 21 మంది ఎంపిక



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మెదక్ స్టేడియంలో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో 21 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో బాలబాలికలకు జరిగిన పోటీల్లో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాకు చెందిన 160 క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన 21 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. బుడో కాన్ కరాటే అకడామిక్ చెందిన శ్రీహిత, విద్యాధర్, శ్రీహర్షి ఉన్నట్లు మాస్టర్ సుభాష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు
కమ్యూనిస్టులే వారసులు

● మహ్మదాపూర్ గుట్టల్లో అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి : సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి, నాయకులు

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 15 : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు వారసులు కమ్యూనిస్టులేనని, నాడు సీపీఐ పోరాటాల ఫలితంగానే తెలంగాణను దేశంలో విలీనం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాల సందర్భంగా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లోని అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం సాయుధ పోరాటాన్ని సాగించి, పేదలకు అండగా నిలిచిన పార్టీ సీపీఐ అన్నారు. ఈ సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని బీజేపీ పార్టీ తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాలను చేస్తామని ముందుకు వస్తున్నారని, ఇది కమ్యూనిస్టుల చరిత్రను కనుమరుగు చేసేందుకు జరుగుతున్న కుట్రని ధ్వజమెత్తారు. మహ్మదాపూర్‌లోని అమరుల ఘాట్ వద్ద స్మృతివనం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరామన్నారు. అలాగే ఇక్కడ కమ్యూనిటీహాల్‌ను నిర్మించాలన్నారు. గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జాగీరు సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న కాషాయవాదులు

దుబ్బాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని కాషాయీకరణ చేసి, మతం రంగుపులుముతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మండల కేంద్రంలో నీలకంఠ సంఘ భవనంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.భాస్కర్ అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ ఎర్రజెండా నాయకత్వంలో కులమతాలకతీతంగా పోరాటాలు నిర్వహించి ఈ ప్రాంతంలో 10 లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాలస్వామి, దుబ్బాక మండల కార్యదర్శి నవీన, కొంపల్లి భాస్కర్, అంజయ్య, ఎల్లయ్య, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ ప్రత్యేక బృందం వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారుల ప్రత్యేక బృందం

కంది, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కందిలోని జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీఏ అధికారుల ప్రత్యేక బృందం వాహనాల తనిఖీ చేపట్టారు. జహీరాబాద్ పరిధిలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్ట్ ఏఎంవీఐ హితేష్‌చౌదరి ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రైవేట్ బస్సులు, లారీలు, డీసీఎంలు, బొలెరో వాహనాలు, ఫిట్నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా ఉన్న వాటికి జరిమానాలు విధించారు. జరిమానా కట్టని కొన్ని వాహనాలను సీజ్ చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. రవాణశాఖ అధికారుల ఆదేశాల మేరకు 15 రోజులపాటు తనిఖీలు నిర్వహిస్తున్నామని హితేష్ చౌదరి తెలిపారు.

అసంక్రమిత వ్యాధుల గుర్తింపు (ఎన్‌సీడీ - నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) స్క్రీనింగ్ సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం గత నెల కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి 30 ఏళ్లు పైబడిన వారందరికీ బీపీ, షుగర్, మానసిక రుగ్మతలు, పాలియేటివ్ కేర్, వయోవృద్ధులకు సంబంధించిన స్క్రీనింగ్ సర్వే చేయాలనే ఆదేశాలు వచ్చాయి. అయితే, ఈ సర్వే చేయలేమని ఏఎన్ఎంలు చేతులెత్తేశారు. దాదాపు నెల రోజులుగా ఈ సర్వే నిలిచిపోయింది.



బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ఎన్‌సీడీ సర్వేకు బ్రేక్!

పనిభారంతో ఏఎన్ఎంలు ససేమిరా

- కొత్త పోర్టల్ తీసుకొచ్చిన ప్రభుత్వం
- ఆభా వివరాల నమోదుకు ఆదేశాలు
- ఏఎన్ఎంల వైఖరిపై కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సీరియస్
- కఠిన చర్యలకు కలెక్టర్‌కు సిఫారసు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వాస్తవానికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వేలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలు ఏటా నిర్వహిస్తారు. కానీ ఈసారి మరో ముందడుగు వేసిన ఆరోగ్య శాఖ కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, 30 ఏళ్లు పైబడిన వారందరికీ ఆధార్, బయోమెట్రిక్ ద్వారా ఆభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) జనరేట్ చేసి, సదరు వ్యక్తికి ఉన్న అలవాట్లతో కూడిన ప్రశ్నావళిని పూరించాలని ఆదేశించింది. అలాగే వ్యాధుల వివరాలు కొత్త పోర్టల్‌లో నమోదు చేయాలి. ఏఎన్ఎంలు మాత్రం ఈ సర్వే చేయలేమంటున్నారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులతో పాటు డీఎంహెచ్‌వోకు లిఖిత పూర్వకంగా రాసిచ్చారు.

ఏఎన్ఎంలకు

32 రకాల పనులు

సంగారెడ్డి జిల్లాలో సుమారు 250 మంది వరకు ఏఎన్ఎంలు పనిచేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు టీకాలు, బీపీ షుగర్ బాధితులకు మందులు పంపిణీ చేయడం, గ్రామాల్లో జ్వర, టీబీ, కుష్ఠు వివిధ రకాల సర్వేలు, రిజిస్టర్ల నిర్వహణ ఇలా సుమారు 32 రకాల పనులతో మోయలేని భారం పడుతోందని ఏఎన్ఎంలు పేర్కొంటున్నారు. ఇవన్నీ కాదని కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి మళ్లీ ఇంటింటికి వెళ్లి సర్వే చేయడం తమతో కాదని స్పష్టం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి సెల్‌ఫోన్లు ఉండవని, ఇంటర్నెట్ సమస్యలు ఉన్నట్టు చెబుతున్నారు.

వ్యాధిగ్రస్థుల వివరాలు

సంగారెడ్డి జిల్లాలో 15,39,764 జనాభా ఉండగా, 30 ఏళ్లు పైబడిన వారు 8,04,980 మంది ఉన్నారు. వీరిలో బీపీతో 77,997 మంది, షుగర్‌తో 38,908 మంది, ఇతరత్ర క్యాన్సర్ లక్షణాలతో 354 మంది, అదేవిధంగా 414 మంది పాలియేటివ్ కేర్ సర్వీసెస్ పొందుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వే చేయబోమని ఏఎన్ఎంలు ప్రజావాణిలో లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. ఆ విషయం ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

-డా.నాగనిర్మల,
డీఎంహెచ్‌వో, సంగారెడ్డి జిల్లా

సర్వే చేయాల్సిందేనంటున్న ఆరోగ్య శాఖ

ఇదివరకు కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసేవారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను అమలులోకి తెచ్చింది. అయితే ఏఎన్ఎంల వైఖరిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లో సర్వే చేయించాల్సిందేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు మౌఖికంగా సూచించినట్టు సమాచారం. ఒకవేళ ఏఎన్ఎంలు సర్వే చేయకపోతే కఠిన చర్యలకు త్వరలో కలెక్టర్‌కు సిఫారసు చేసే అవకాశం లేకపోలేదని ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

'గీతం'లో ఘనంగా ఇంజనీర్స్ డే

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కోగస్, గిట్ హబ్ కమ్యూనిటీ, ఇన్నోవేషన్ సెంటర్, కాడ్ ఏఐ విద్యార్థి విభాగాలు (క్లబ్‌లు) సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలను సంయుక్తంగా నిర్వహించాయి. అభ్యాసం, ఆవిష్కరణ, వినోదాల మేలు కలయిగా ఈ కార్యక్రమం కొనసాగింది. తొలుత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు పుష్పగుచ్ఛాలు సమర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయా క్లబ్‌లు ఇంజనీర్స్ ఎక్స్ పోను నిర్వహించి, గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని విద్యార్థుల నుంచి వినూత్న ప్రాజెక్టులు, సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించారు. అధునాతన సాంకేతికతలను తెలుసుకోవడానికి, ఆవిష్కర్తలతో సంభాషించడానికి విద్యారులకు ఈ ఎక్స్‌పో చక్కని అవకాశంగా మారింది. ఈ వేడుకల్లో భాగంగా, ఎల్ఎస్ఈజీ(ఎల్ఎస్ఎఫ్‌జీ)లో లీడ్ ఇంజనీర్ ఖాజా మొయినుద్దీన్ మొహమ్మద్ క్యాంపస్ నుంచి కార్పొరేట్ వరకు అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఆయన ప్రసంగంలో, కార్యాలయ సంసిద్ధత, కెరీర్ వృద్ధి, కళాశాల జీవితం నుంచి కార్పొరేట్ ప్రపంచానికి విజయవంతంగా మారడంపై విలువైన విషయాలను పంచుకున్నారు. అనుకూలత, నిరంతర అభ్యాసం, పట్టుదల ప్రాముఖ్యతను తెలియజేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించండి పనిచేసే చోట నైతిక ప్రమాణాలు, పద్ధతులపై చర్చలో యువ నిపుణులు తమ కెరీర్లలోకి అడుగుపెడుతున్నప్పుడు బాధ్యతాయుతమైన పద్ధతులను స్వీకరించాలని మానసిక శాస్త్రవేత్తలు సూచించారు.



కార్యక్రమానికి హాజరైన అతిథులు

మంత్రి ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు



సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ ఇంటి ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటిని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ పీఎంశ్రీ విద్యను నిర్వహించాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తో పాటు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు నూతన జాతీయ విద్యావిధాన చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన మాట ప్రకారం కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు యాదగిరి, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశికళ, మంగ, నాయకులు ఏసుమని, మంజుల, భ్రమరాంబ, కల్పన, జమున, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్ సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. పటాన్‌చెరు పారిశ్రామికవాడైన పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ కార్మికులకు న్యాయం చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు, కార్మికుల కుటుంబసభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. జహీరాబాద్ చక్కెర కర్మాగారం కార్మికులకు న్యాయం చేయాలని, సంగారెడ్డిలోని సిద్ధార్థనగర్ శ్మశానవాటికకు దారిని మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన నిర్వహించారు. నిమ్జ్ కోసం బలవంతపు భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రైతులతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి

- 17 నుంచి సంగారెడ్డిలో నిరాహార దీక్షలు
- ప్రభుత్వాలు స్పందించకుంటే ఆమరణ దీక్ష
- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17 నుంచి 19వ వరకు సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో నిరాహార దీక్ష చేయనున్నట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులో గెలుపోటములు సహజమని, కానీ కేసు ఓడిపోతే దానికి న్యాయవాదే కారణమంటూ కక్షిదారులు కొందరు కక్ష పెంచుకొని భౌతికదాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం వుంటే సమాజంలో కొంత భయం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సంగారెడ్డిలో మొదలైన తమ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని, అవసరమైతే తాను ఆమరణ దీక్షకు కూడా వెనుకాడబోనని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.మహేష్, న్యాయవాదులు సుభాష్‌చందర్, భాస్కర్, రాములు, గోవర్ధన్, సతీష్, శ్రీకాంత్, మాణిక్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నిరాహార దీక్షకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.



నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న న్యాయవాదులు

యూరియా కొరత.. రైతుల కలత

(5వ పేజీ తరువాయి)

యూరియా కొరత కారణంగా సంచలన ఘటనలు ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్నాయి. పీఏసీఎస్ సొసైటీలు, రైతు వేదికల వద్ద చెప్పులు, పాస్‌బుక్ జీరాక్స్ పత్రాలు క్యూలైన్లలో పెట్టడం నిత్యకృత్యంగా మారింది. గజ్వేల్‌లో యూరియా కోసం ఇద్దరు మహిళలు చెప్పులతో కొట్టుకోవడం చర్చనీయాంశమైంది. మిరుదొడ్డిలోని రైతు వేదికలో ఫర్నీచర్‌ను రైతులు ధ్వంసం చేశారు. దుబ్బాకలో చలిమంటలు కాచుకుంటూ తెల్లార్లు టోకెన్ల కోసం ఎదురు చూసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికీ ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బస్తా యూరియా కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నారు. రైతులను కట్టడి చేయడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరిపడా యూరియా నిల్వలు లేక వ్యవసాయాధికారులు ఆచితూచి టోకెన్లు పంపిణీ చేస్తూ.. కొద్దిరోజులుగా తెల్లవారుజామున్నే విధులకు హాజరవుతున్న పరిస్థితి పలు మండలాల్లో చోటు చేసుకుంది.

7వేల టన్నులు అవసరం

ప్రస్తుత నెలలో యూరియా సమస్య గట్టెక్కాలంటే దాదాపు 7వేల మెట్రిక్ టన్నులు అవసరం. సిద్దిపేట జిల్లాకు 3,988 టన్నులు, సంగారెడ్డి జిల్లాకు 2,036, మెదక్ జిల్లాకు 1,091 టన్నుల యూరియాను సరఫరా చేయాల్సి ఉంది. గత ఆగస్టులోనూ సరిపడా నిల్వలు సరఫరా లేకపోవడం వల్లనే పెద్దఎత్తున ఆందోళనలు నెలకొన్నాయి. ఆగస్టులో దాదాపు 10వేల టన్నుల సరఫరా నిలిచిపోయింది. ఇప్పుడు సెప్టెంబరులోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. వెనువెంటనే రావాల్సిన నిల్వలపై దృష్టి పెడితే రైతుల సమస్యలను పరిష్కరించవచ్చు. జూన్, జూలై మాసాల్లోనూ యూరియా కేటాయింపు తగ్గించడంతో నిల్వలు లేకుండా పోయాయి. లారీల్లో వస్తున్న యూరియా బస్తాలు నిమిషాల్లోనే కానరాకుండా పోతున్నాయంటే రైతులకు ఏ స్థాయిలో అవసరం ఉందో అర్థమవుతోంది.

క్యూలో నిల్చుంటే కూలీ

గంటల తరబడి క్యూలో నిల్చుంటే సమయం వృథా అవుతుందని భావించి పలువురు పెద్ద రైతులు కూలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పాస్‌బుక్, ఆధార్‌కార్డు పట్టుకొని లైన్‌లో నిల్చుని టోకెన్‌లు తెచ్చి ఇస్తే రూ.100 నుంచి రూ.200 దాకా కూలీ డబ్బు ఇస్తున్న పరిస్థితి పలుచోట్ల నెలకొంది. ఇక సాగు చేయని భూములకు సంబంధించిన రైతులు కూడా తమ పాస్‌బుక్ పేరిట రూ.280కి యూరియా బస్తాలను కొనుగోలు చేసి రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్న సందర్భాలూ హుస్నాబాద్ ప్రాంతంలో వెలుగులోకి వచ్చాయి.

యూరియా వరదపాలు..

ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద ప్రవాహాలు పోటెత్తుతున్నాయి. ఈ పరిస్థితి యూరియాపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. అష్టకష్టాలు పడి యూరియా చల్లగా వరదకు కొట్టుకుపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ మధ్య కాలంలో చల్లిన యూరియాతో ఫలితం లేకుండా పోయిందని.. రెండుమూడు మార్లు రైతులు టోకెన్ల కోసం వస్తున్నారు. ఇక నానో యూరియాతో అంతంత మాత్రమే ఫలితం ఉంటుందని పెదవి విరుస్తున్నారు. దీనిపై వ్యవసాయశాఖ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సంగారెడ్డి జిల్లా చౌటకూర్‌లో రైతుల నిరీక్షణ



జగదేవ్‌పూర్ గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

అన్నదాతల రాస్తారోకో

జగదేవ్‌పూర్/రామాయంపేట/పుల్కల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంటల తరబడి నిరీక్షించిన యూరియా పంపిణీ చేసేందుకు అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు జగదేవ్‌పూర్, రామాయంపేటలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి సోమవారం 560 బ్యాగుల యూరియా వచ్చింది. విషయం తెలుసుకుని మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద టోకెన్‌ల కోసం ఉదయం నాలుగు నుంచే క్యూలైన్‌లో పట్టాపాస్‌బుక్‌లు ఉంచి బారులు తీరారు. ఉదయం పది గంటల వరకు అధికారులు రాకపోవడంతో అన్నదాతలు మండిపడుతూ గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అక్కడకు చేరుకొని నచ్చజెప్పారు. మరో 400 బ్యాగ్‌ల యూరియా సోమవారం సాయంత్రానికి మండల కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. మంగళవారం రైతులకు యూరియా టోకెన్‌లు అందించనున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లా రామాయంపేటలోని సొసైటీ కార్యాలయం ఎదుట రైతులు చెట్ల కొమ్మలను వరుసలో ఉంచారు. వేకువజాము నుంచే వేచిచూసినా యూరియా రాలేదు. ఆగ్రహంతో రైతులు పట్టణంలో పాత హైవేపై రాస్తారోకోకు దిగారు. సీఐ వెంకట రాజాగౌడ్ చేరుకొని వారిని సముదాయించారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రానికి 540 యూరియా బస్తాల లోడు వచ్చింది. ఆధార్ కార్డు, పట్టదారు పుస్తకానికి రెండు యూరియా బస్తాల చొప్పున అందజేయగా, ఇతర మండలాల నుంచి కూడా రైతులు తరలివచ్చారు. ఒకరినొకరు తోసుకుంటూ దుకాణంలోకి ఎగబడగా, గందగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో నిర్వహకులు కొద్దీసేపు పంపిణీని నిలిపివేశారు. క్యూలైన్ ఏర్పాటు చేసి, బస్తాలను పంపిణీ చేశారు.

'సింగూరు'కు మళ్లీ వరద..
తెరుచుకున్న మూడు గేట్లు

ఇన్‌ఫ్లో 24,284.. ఔట్‌ఫ్లో 24,777 క్యూసెక్కులు

పుల్‌కల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు మళ్లీ వరద పోటెత్తుతున్నది. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వారం రోజుల క్రితం వరద పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో నీటి పారుదల శాఖ అధికారులు గేట్లన్నింటినీ మూసేశారు. రెండు, మూడు రోజులుగా ఎగువ నుంచి మళ్లీ ఉధృతంగా వరద ప్రవాహం ప్రాజెక్టులోకి చేరుతున్నది. దీంతో సోమవారం 8, 9, 10వ నంబర్ క్రస్ట్ గేట్లను మీటరున్నర ఎత్తి దిగువన మంజీర జలాశయానికి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 24,284 క్యూసెక్కులుగా నమోదైంది. మూడు క్రస్ట్ గేట్ల ద్వారా 21,840 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 2,272 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కులు ఆవిరి అవుతుండగా మొత్తం ఔట్‌ఫ్లో 24,777 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 520.795 మీటర్లకు 17.544 టీఎంసీల నీటి నిల్వ ఉన్నాయి. సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ 6, 7 నంబర్ క్రస్ట్ గేట్లను 4 మీటర్లు, స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే దిగువన ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

ఏడుపాయల్లో కొనసాగుతున్న వరద

పాపన్నపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద వరద ప్రవాహం కొనసాగుతుంది. సింగూరు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఆలయం వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉంది. రెండు రోజులుగా ఆలయం మూసివేసి రాజగోపురంలో అమ్మవారికి పూజలు చేస్తున్నారు. వనదుర్గా ప్రాజెక్టు (ఘనపురం కట్ట) నుంచి 26,316 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తుంది.



సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

న్యూస్ బాక్స్

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్

కొమురవెల్లి,సెప్టెంబర్15(ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ విభాగం స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని అయినపూర్ గ్రామంలో మహిళా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.అనంతరం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులందరికీ శానిటరీ ప్యాడ్స్ అందించేందుకు కృషి చేస్తామన్నారు.

స్నేహితుడికి అండగా..

వర్గల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిత్రుడికి ఆర్థికసాయమందించి అండగా నిలిచారు తోటి స్నేహితులు. వర్గల్ మండల కేంద్రానికి చెందిన కాశ కుబేరాచారి 15 రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఈ విషయాన్ని తెలుసుకున్న 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన కుబేరాచారి స్నేహితులు తలా కొంత జమచేసి రూ. 25వేల ఆర్థికసాయాన్ని కుబేరాచారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో భానుప్రసాద్, పరశురాములు, స్వామి, రవి ఉన్నారు.

చెట్లను పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

సిద్దిపేట రూరల్,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచుదాం..పర్యావరణాన్ని కాపాకుందామని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్, పర్యావరణ ప్రేమికుడు లక్కర్సు ప్రభాకర్ వర్మ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామంలో సీడ్ బాల్స్‌ను చల్లారు. ఈ సందర్భంగా ప్రభాకర్ వర్మ మాట్లాడుతూ ప్రతి ఏటా పది మందితో కలిసి 10 లక్షల సీడ్ బాల్స్‌ను తయారు చేసి వివిధ ప్రాంతాలకు పంపించి రోడ్ల పక్కన, అడవుల్లో, గుట్టలపైన చల్లుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీదేవి చందర్ రావు, మాజీ కౌన్సిలర్ ఐలయ్య, లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, యాదవ సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు ఎలుపుల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గురుకులాలు నిర్వీర్యం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని సిద్దిపేట జిల్లా ఏబీవీపీ కన్వీనర్ ఆదిత్య అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. 21 నెలల కాంగ్రెస్ పాలనలో కళాశాలలను స్వయంగా యాజమాన్యాలే బంద్ చేయడం ఇది రెండోసారని, ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. విద్యార్థులకు ఫీజు చెల్లించాలని అడిగితే ఖజానా ఖాళీగా ఉందని చెప్పడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో రూ.8,500ల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, కళాశాలలు బంద్ చేయడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థుల పై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ భాను ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి అనీష్, నగర ఉపాధ్యక్షుడు లోకేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నీ బంద్

చేర్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థపాలనలో సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నీ బంద్ అయ్యాయని, మార్పుతో ప్రజలకు ఒరిగిందేమీలేదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ విమర్శించారు. చేర్యాల పట్టణంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆపేయడంతో కాలేజీలు బంద్ పాటిస్తున్నాయని, నిధులు లేక గ్రామాల్లో పారిశుధ్యం బంద్ చేయడంతో పాటు డీజిల్‌కు డబ్బులు లేక చెత్తసేకరణ ట్రాక్టర్లను బంద్ పెట్టారన్నారు. రైతులకు రుణమాఫీ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ బంద్ చేశారని, రైతులకు యూరియా అందించడం లేదన్నారు.

బిల్లులు సత్వరమే చెల్లించాలి

అక్కన్నపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిల్లులు సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జనగామ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ముద్రబోయిన సరిత నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తమ ట్రాక్టర్ ద్వారా 80 ట్రిప్పుల మట్టిని రోడ్డుకు పోశామని, ఆ బిల్లుతో పాటు ఆరు ఇంకుడు గుంతల బిల్లులు రావాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బిల్లులు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అప్పులు చేసి పనులు చేశామని వాపోయింది.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మిరుదొడ్డి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 9నుంచి 12వరకు సిద్దిపేటలో జరిగిన అండర్14 వాలీబాల్ క్రీడా పోటీల్లో అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల బాలికల జట్టు జిల్లాలో ప్రతిభను చాటారు. జిల్లాస్థాయిలో జరిగిన వాలీబాల్‌పోటీల్లో ఖాజీపూర్ బాలికలు తృతీయస్థానం సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్‌రెడ్డి, పీఈటీ నరేష్ తెలిపారు.



గజ్వేల్ ఐవోసీ ఎదుట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, దివ్యాంగులు



ములుగు: తహసీల్ కార్యాలయం ఎదుట దివ్యాంగులతో కలిసి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



చేర్యాలలో తహసీల్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పిస్తున్న దివ్యాంగులు

పెన్షన్లు పెంచి ఇవ్వాల్సిందే..



కుకునూరుపల్లి తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ తమకు ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా పెన్షన్‌దారులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా మండలకేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్ కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 22 నెలలు గడిచినా, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన పెన్షన్ల పెంపు హామీ ఊసే ఎత్తడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు పెంచుతామన్న పెన్షన్లను పెంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పెన్షనర్ల పక్షాన ఉద్యమించాల్సివస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



నారాయణరావుపేట తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించిన పెన్షన్‌దారులు

యూరియా కొరతలేకుండా చూస్తాం: డీఏవో



నారాయణరావుపేటలో యూరియాను పంపిణీ చేస్తున్న డీఏవో స్వరూపారాణి



మద్దూరులో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, సాగుకు సరిపడా యూరియాను కొరత లేకుండా అందిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి భరోసా కల్పించారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో రైతు వేదికను ఆమె సందర్శించి పీఏసీఏస్, గుర్రాలగొంది ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేస్తున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో స్వరూపరాణి మాట్లాడుతూ రైతులు వర్షాకాలంలో సాగు చేసిన పంటల వివరాలను క్లస్టర్లవారీగా దగ్గరలోని ఏఈవోల దగ్గర నమోదు చేసుకోవాలని సూచించారు. యూరియా సరఫరా తీరుపై రైతులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో పరుశురాం రెడ్డి, పీఏసీఏస్ సీఈవో క్రిష్ణ, ఏఈవోలు మౌనిక, వరుణ్ కుమార్, అఖిల సిబ్బంది పాల్గొన్నారు.

● **మద్దూరు:** మండల కేంద్రంలోని సొసైటీ క్యాష్ కౌంటర్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాలను అందించారు. రైతులు యూరియా బస్తాలు వచ్చాయన్న సమాచారంతో పొద్దున్నే సొసైటీ క్యాష్ కౌంటర్ వద్ద క్యూకట్టారు. ఏవో రామకృష్ణ మాట్లాడుతూ.. సొసైటీకి 40 టన్నుల యూరియా వచ్చిందని, సుమారు 250 మంది రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు.

సరైన పద్ధతిలో మందులు వాడాలి

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంటకు సరైన పద్ధతిలో మందులు వాడితే అధిక దిగుబడి వస్తుందని ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ రీజినల్ మేనేజర్ భీష్మచారి పేర్కొన్నారు. పత్తి పంటలో వచ్చే విల్ట్ తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక ఇతరత్రా, వరి పంటలో వచ్చే తెగుల నివారణకు ట్రాక్టర్ బ్రాండ్ వారి ఉత్పత్తులు గురించి సోమవారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో రైతులకు అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

హుస్నాబాద్/గజ్వేల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హుస్నాబాద్, గజ్వేల్ పట్టణాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. హుస్నాబాద్ పట్టణంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంప్ ఆఫీసు సమీపంలో ధర్నా నిర్వహించారు. ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలంటూ పలు డిమాండ్లు చేశారు. అనంతరం మంత్రి పీఏకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, నాయకులు తదితరులున్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్య పేరుతో ఐదేళ్లలోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగించడం ద్వారా అంగన్‌వాడీ వ్యవస్థ నిర్వీర్యం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాకమిటీ సభ్యులు ఉన్నారు.

కర్ర శ్రీహరికి ప్రముఖుల ఘన నివాళి



శీహరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బండి సంజయ్

కోహెడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనిగరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీహరి కుటుంబ సభ్యులను సోమవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీహరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం రాత్రి కేంద్రమంత్రి బండిసంజయ్ శ్రీహరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో పేద ప్రజల కోసం ఎనలేని సేవలు చేశాడని కేంద్ర మంత్రి గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సైతం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు శ్రీహరితో తమకు గల రాజకీయ అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. పరామర్శించినవారిలో కరీంనగర్ సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ బెజ్జంకి మండల అధ్యక్షుడు షైపాల్ రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

సందడిగా వైట్ కోట్ సెర్మనీ



వైట్ కోట్‌తో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ విభాగాల ఆధ్వర్యంలో నూతనంగా చేరిన విద్యార్థుల కోసం నిర్వహించిన వైట్ కోట్ సెర్మనీ సందడిగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. సునీత మాట్లాడుతూ, వైట్ కోట్ బాధ్యత, నిజాయితీ, సేవా భావనలకు ప్రతీక అన్నారు. ఈ క్షణం నుంచి మీరు శాస్త్రవేత్తలుగా, ఆరోగ్యరంగానికి మద్దతుదారులుగా మీ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారని చెబుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. జి. మదన్ మోహన్, బయోటెక్నాలజీ విభాగాధిపతి వి. రోహిణి మాట్లాడుతూ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ రంగాలు భవిష్యత్ వైద్య, శాస్త్రీయ పరిశోధనలకు ఆధారస్తంభాలని వివరించారు. అంతకు ముందు విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.పి అయోధ్యరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి, డా. గోపాల సుదర్శనం, డా. మధుసూదన్, శ్రీదేవి, వేణు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

● జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సేవలు మరవలేనివని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల కార్మికులకు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బంక చందు తన సొంత ఖర్చులతో టీషర్టులను అందజేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిత్యం గ్రామంలోని వార్డులను పరిశుభ్రంగా కాపాడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి , బంక చందు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఆనందం కోసం జీవితాలు పాడుచేసుకోవద్దు

గజ్వేల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యువత తాత్కాలిక ఆనందం కోసం జీవితాలు పాడుచేసుకోవద్దని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులతో సహకరించాలని కోరారు. యువత తాత్కాలిక ఆనందాల కోసం నిండు జీవితాన్ని పాడుచేసుకోవద్దన్నారు. గంజాయి, మత్తు పదార్థాలపై నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మండలం బుర్గుపల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్ తదితర అంశాల గురించి షీటీంతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ కిష్టారెడ్డి, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

మర్కుక్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో హైదరాబాద్‌లోని బేగంపేట డిగ్రీ ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా సోమవారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వీధులగుండా తిరుగుతూ ప్లాస్టిక్ కవర్లను సేకరించి గార్బేజ్ కవర్లలో వేశారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి మాజీ సర్పంచ్ భాగ్యభిక్షపతి బేగంపేట డిగ్రీ కళాశాల విద్యార్థినిలను అభినందించారు.

కాంగ్రెస్‌లో వర్గపోరు

(5వ పేజీ తరువాయి..)

చేయగా, క్రమశిక్షణ కమిటీ పూజల హరికృష్ణను వివరణ కోరింది. ఈ విషయం తెలుసుకున్న పూజల హరికృష్ణ వర్గం, నర్సారెడ్డి ఇతర పార్టీలకు కోవర్టుగా పనిచేస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారంటూ పీసీసీ, క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు.

డీసీసీ నర్సారెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు

ఆగస్టులో గజ్వేల్‌లో జరిగిన రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా తనను కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేస్తూ విజయ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నర్సారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. దీనికి తోడు, ఇటీవల సిద్దిపేటలోని డీసీసీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో తన వాహనానికి అడ్డుపడిన ఎస్సీ సెల్ నాయకులను నర్సారెడ్డి దూషించారని విజయ్ మరోమారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిణామాలను ఎస్సీ సెల్ నాయకులు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లడంతో క్రమశిక్షణ కమిటీ నర్సారెడ్డికి నోటీసులు జారీ చేసింది.

గాంధీభవన్‌కు చేరిన పంచాయితీ

నాయకుల మధ్య నెలకొన్న విభేదాల వల్ల సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పంచాయతీ గాంధీభవన్‌కు చేరింది. గతంలో మైనంపల్లి హనుమంతరావు వర్సెస్ నర్సారెడ్డిగా ఉన్న విభేదాలు, ఇప్పుడు నర్సారెడ్డి వర్సెస్ పూజల హరికృష్ణగా మారాయి. త్వరలో డీసీసీల నియామకం ఉండడంతో, రేసులో ఉన్న నాయకులను విమర్శలపాలు చేసేందుకే ఈ గ్రూపు రాజకీయాలు జరుగుతున్నాయని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని కొందరు కాంగ్రెస్ నాయకులు చర్చిస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించి, విభేదాలకు ముగింపు పలకాలని సీనియర్ నాయకులు సూచిస్తున్నారు.

ఘనంగా జాతీయ సివిల్ ఇంజనీర్ల దినోత్సవం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సివిల్ ఇంజనీర్లు

గజ్వేల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ సివిల్ ఇంజనీర్ల దినోత్సవాన్ని గజ్వేల్ పట్టణంలో సివిల్ ఇంజనీర్లు ఘనంగా నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంజనీర్స్ యూనియన్ నాయకులు నరేశ్, వైస్ ప్రెసిడెంట్ వినీత్ మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య జీవితం స్ఫూర్తిదాయకమని, నేటి సివిల్ ఇంజనీర్లకు ఆయన ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్లు శ్రీకాంత్, శ్రీకాంత్ రేపాల, బాలాజీ, రాజశేఖర్‌రెడ్డి, సుమంత్, సురేశ్, సంజయ్‌కుమార్, విష్ణు, సాయిచరణ్, మురళీ, అబ్దుల్, నవేశ్ తదితరులున్నారు.

హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో విలీనం చేయాలి: బీజేపీ



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లాలో ఉన్న హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను తిరిగి కరీంనగర్ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. గత ప్రభుత్వం కరీంనగర్ జిల్లాలో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేస్తే ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల సమయంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలను తిరిగి కరీంనగర్‌లో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సంపత్ నాయక్, నాయకులు బొమ్మగాని సతీష్, మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, వెల్దండి రాజేంద్రప్రసాద్, బొల్లి శ్రీనివాస్, జగన్నాథం, తదితరులున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి: మెదక్ ఎంపీ



మెదక్ ఎంపీతో గజ్వేల్ నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గజ్వేల్ మండలంలో బీజేపీ సత్తా చాటేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు సూచించారు. బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల నాయకులు ఎంపీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీని కలిసినవారిలో నాయకులు ఎల్కంటి సురేశ్, కర్నాల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప స్వామి, మండల ఉపాధ్యక్షుడు బీనమైన ప్రభాకర్, బీం కుమార్, శాతం స్వామి, బీజేవైఎం నాయకులు నవీన్ ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో సోషల్ సైన్స్ ఫెస్టివల్



డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నిఖత్ అంజూమ్

గజ్వేల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సోషల్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో సోషల్ సైన్స్ ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డా. నిఖత్ అంజూమ్ హాజరై ప్రసంగించారు. తరగతి గదుల్లోనే కాకుండా నిజ జీవితంలో ఆయా సబ్జెక్టులకు సంబంధించిన అంశాలను కళ్లకు కట్టినట్లు విద్యార్థులకు వివరించడం గొప్ప విషయమన్నారు. అనంతరం వివిధ రకాల వంటకాలను ఆమె పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన



చేర్యాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ప్రతిభ డిగ్రీకళాశాల అధ్యాపకులు

చేర్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ప్రభుత్వం జాప్యం వహిస్తుండటం తగదని పేర్కొంటూ చేర్యాల పట్టణంలోని పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తాము పాటుపడుతున్నా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయడంలో ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడంతో ఇబ్బందులుపడుతున్నామన్నారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేసేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.


సిద్దిపేట క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి



గజ్వేల్‌లో సెలక్షన్స్‌ను ప్రారంభిస్తున్న కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

గజ్వేల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేతి చిన్న సంతోష్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ మైదానంలో నిర్వహించిన బాల, బాలికల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల, బాలికలు నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో 200మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ తెలిపారు. బాలుర విభాగంలో మొదటి బహుమతి ఏకలవ్య కబడ్డీక్లబ్, ద్వితీయ బహుమతి జీడీఆర్ పాఠశాల ఎంపికైనట్టు తెలిపారు. సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టు కోసం 24మంది చొప్పున బాల, బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28వరకు నిజామాబాద్‌లో జరిగే 35వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు వారం రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా గోకులాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

వర్గల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వర్గల్‌లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ వైష్ణవం గోకులాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు వేదాంతం మురళీధరచార్యుల నేతృత్వంలో ఉదయం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవతా మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద శత కలశాభిషేకం, పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా చేశారు. వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.